www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | బుధవారం, అక్టోబర్ 7,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:212 | పేజీలు: 8 | వెల: రూ.5/-

రక్షణ మంత్రి పర్యటనలో అపశ్రుతి..

విశాఖపట్నంలో అపశ్రుతి చోటుచేసుకుంది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటన సందర్భంగా భద్రతా విధుల్లో ఉన్న ఓ పోలీస్ కానిస్టేబుల్ సర్వీస్ రైఫిల్ ప్రమాదవశాత్తు పేలింది. ఈ ఘటనలో కానిస్టేబుల్ అప్పలకొండ తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం విశాఖలోని ఐఎన్ఎస్ డేగా వద్ద ఈ సంఘటన జరిగింది.రాజ్‌నాథ్ సింగ్ ప్రయాణించాల్సిన విమానం వద్ద ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌కు చెందిన ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) కానిస్టేబుల్ అప్పలకొండ భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో ఆయన చేతిలోని సెల్ఫ్ లోడింగ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్) అకస్మాత్తుగా పేలింది. ఈ ప్రమాదంలో బుల్లెట్ ఆయన ఛాతీ ఎడమవైపు భాగంలోకి దూసుకెళ్లింది. పెద్ద శబ్దం వినపడటంతో భద్రతా సిబ్బంది, ఇతర అధికారులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అప్పలకొండను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

మిగిలిన 45 ఎకరాలపై పూర్తి వివరాలు తేల్చాలి

- ఆ 45 ఎకరాల గుర్తింపునకు సర్వే చేయండి: సీఎం రేవంత్ ఆదేశాలు
- జూన్ 2లోగా నిర్మాణం పూర్తి కావాలి

ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో 388 ఎకరాలకుగాను తేలింది 343 ఎకరాలే

- ఆ భూముల్లో అమరుల కుటుంబాలకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలి
- మల్లన్న సాగర్ నీటి అక్రమ వినియోగదారులపై చర్యలు తీసుకోవాలి



హైదరాబాద్, అక్టోబర్ 6సామాన్యుడి అస్త్రం

: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో 45 ఎకరాల భూముల ఆచూకీ లభ్యం కానుందున, వాటి గుర్తింపునకు వెంటనే సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 22ఏ పై శాసనసభలో గత నెల 16న నిర్వహించిన చర్చలో ఆ భూములపై విచారణకు సీఎం ఆదేశించిన విషయం తెలిసిందే. విచారణ పురోగతిపై ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధీ పెవిలియన్‌లో మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, భూ అక్రమాలపై విచారణకు వేసిన కమిటీ, ధరణి అక్రమాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ పురోగతిపై సీఎం రేవంత్ కమిటీ సభ్యులను ప్రశ్నించారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదైందని, కానీ తాజా సర్వ్‌లో 343 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు గుర్తించామని సీఎంకు అధికారుల వివరించారు. రికార్డులో ఉన్న భూమికి, వాస్తవంగా ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉందని అధికారులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆ 45 ఎకరాల భూమిని తేల్చేందుకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వేకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సర్వే నెంబర్ 325 సమీపంలోనే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఆయన కుటుంబ సభ్యులకు భూములు ఉన్నందున, వారి భూముల రికార్డులను సమర్పించాలని నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.



సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో

విపక్షాల భారీ నిరసన

- పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయానికి ఇండియా కూటమి ర్యాలీ
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన రాహుల్ గాంధీ
- రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ సహా పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆకాశవాణి భవన్‌లో బైఠాయించి కొనసాగుతున్న ఆందోళన

న్యూఢిల్లీ,సామాన్యుడి అస్త్రం

దేశ రాజధాని ఢిల్లీ మంగళవారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు, హైడ్రామాకు దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వైపు నిరసన ర్యాలీగా బయలుదేరారు. అయితే, ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి, చేతిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ తన నిరసనను తీవ్రతరం చేశారు. అనంతరం ఇతర నేతలతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఢిల్లీ పోలీసులు రంగప్రవేశం చేసి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (యూబీటీ) సహా పలువురు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని బస్సుల్లోకి ఎక్కించారు.

భారత వాయుసేన నూతన అధిపతిగా అశుతోష్ దీక్షిత్

- ప్రస్తుతం వైస్ చీఫ్‌గా ఉన్న దీక్షిత్‌కు పదోన్నతి
- అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న అమర్ ప్రీత్ సింగ్
- 3,500 గంటలకు పైగా ఫైటర్ జెట్ నడిపిన అనుభవం
- త్రివిధ దళాల సమన్వయం, ఆధునికీకరణపై దృష్టి



న్యూఢిల్లీ,సామాన్యుడి అస్త్రం

భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. దీనితో ఆయన భారత వాయుసేనకు 29వ అధిపతిగా నిలవనున్నారు.నైపుణ్యం కలిగిన ఫైటర్ పైలట్ అయిన అశుతోష్ దీక్షిత్‌కు 3,500 గంటలకు పైగా యుద్ధ విమానాలను నడిపిన అపార అనుభవం ఉంది. ఆయన 1986 డిసెంబర్ 6న ఐఏఎఫ్ ఫైటర్ విభాగంలో కమిషన్ పొందారు.

ప్రివిలేజ్ ఫీజుతో బార్ల యజమానులకు నష్టం లేదు

- వినియోగదారులపై పడేది స్వల్ప భారమేనని స్పష్టీకరణ
- బీఆర్ఎస్ హయాంలో మద్యం ఆదాయం 260 శాతం పెరిగిందని వెల్లడి

హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం

రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన ప్రివిలేజ్ ఫీజు వల్ల బార్ల యజమానులకు ఎలాంటి నష్టం జరగదని, వినియోగదారులపై మాత్రమే స్వల్ప భారం పడుతుందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలపై ఆయన స్పందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...
మద్యం ధరలు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందే తప్ప, వినియోగం పెద్దగా తగ్గదని గత అనుభవాలు చెబుతున్నాయన్నారు.



దక్షిణ రాష్ట్రాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్

- సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు అందిస్తున్న 100 మందికి పైగా అరెస్ట్
- ఏపీ, తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు
- హైదరాబాద్ డాక్టర్‌ను మోసం చేసి రూ.11 కోట్లు కాజేసిన కేసులో దర్యాప్తు

హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం

సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న ముఠాలపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఉక్కుపాదం మోపింది. గత రెండు వారాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు దక్షిణ రాష్ట్రాల్లో చేపట్టిన మెగా ఆపరేషన్‌లో 100 మందికి పైగా ఏజెంట్లను అరెస్టు చేసింది. సైబర్ మోసగాళ్లకు 'మ్యూల్' బ్యాంకు ఖాతాలు, కేవైసీ పత్రాలు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై వీరిని అదుపులోకి తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో బ్యూరో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి.నిందితుల నుంచి మ్యూల్ ఖాతాలకు సంబంధించిన డెబిట్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు.



ఏపీ పోలీసు వ్యవస్థలో


కీలక మార్పు

- గుంటూరు, తిరుపతి, కర్నూలు, రాజమహేంద్రవరంలో నూతన కమిషనరేట్లు
- ఐజీ/డీఐజీ స్థాయి అధికారులకు కమిషనర్ బాధ్యతలు



అమరావతి(సామాన్యుడి అస్త్రం

ఏపీలో పోలీసు పాలనా వ్యవస్థలో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్రంలోని నాలుగు ప్రధాన నగరాల్లో కొత్తగా పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. గుంటూరు, తిరుపతి, కర్నూలు, రాజమహేంద్రవరం నగరాలు ఇకపై పోలీస్ కమిషనర్ల పర్యవేక్షణలోకి రానున్నాయి.



ఎట్టి పరిస్థితుల్లోనూ

జాప్యం వద్దు

రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష

అమరావతి,సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు.

బీసీ రిజర్వేషన్ల భయంతోనే వైసీపీ కోర్టులకు..

- బీసీల సంక్షేమంపై వైసీపీకి చిత్తశుద్ధి లేదన్న మండిపల్లి
- 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామన్న మంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే విజయమని ధీమా

అమరావతిసామాన్యుడి అస్త్రం

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే భయంతోనే వైసీపీ కోర్టులను ఆశ్రయిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రజల్లోకి వెళ్లి పనిచేసే సత్తా వైసీపీకి లేదని, ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా ఆరోపణలు చేయడం, కేసులు వేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని మంత్రి విమర్శించారు.



స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ కోటా

- ఢిల్లీలో న్యాయ నిపుణులతో చర్చలు జరిపిన టీడీపీ నేతలు
- బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని రామ్మోహన్ నాయుడు ప్రశ్న

అమరావతి,సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు సుప్రీంకోర్టులోనూ పూర్తి అవకాశం ఉందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ లక్ష్యంతోనే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందని తెలిపారు.



మిగిలిన 45 ఎకరాలపై పూర్తి వివరాలు తేల్చాలి

మొదటి పేజి తరువాయి

రైతులకు పంపిణీ చేయాలి



సర్వే నంబర్ 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే, తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ'ని నిర్మించాలని సీఎం ఆదేశించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో కాలనీని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని, వచ్చే జూన్ 2లోగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్ భూములు, మిషన్ భగీరథ భూములు మినహా మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తోపాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. మల్లన్న సాగర్ నీటిని అనధికారికంగా వినిగియోంచే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఆ భూమి గుర్తింపు కోసం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో భాగంగానే ఆ భూమి సరిహద్దులో ఉన్న మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రెవెన్యూ రికార్డులు సబ్‌మిట్ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. సర్వే నంబర్ - 325లో ఉన్న భూమిని స్థానిక అర్హులైన రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయనుంది. సర్వే నంబర్-325లో తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణం చేయాలని సీఎం ఆదేశించారు.తెలంగాణ అమరవీరుల కాలనీలో అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, సకల సౌకర్యాలతో కాలనీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని ఆదేశించారు. జూన్ 2వ తేదీలోగా అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.సర్వే నంబర్ 325లో ఉన్న భూమిని స్థానిక అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సర్వే నంబర్ 325లో తెలంగాణలో ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం తెలంగాణ అమరవీ రుల కాలనీ నిర్మాణం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ అమరవీరుల కాలనీలో అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి సకల సౌకర్యాలతో జూన్ 2లోగా కాలనీ నిర్మాణం పూర్తిచేయాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాలన్నారు. మల్లన్న సాగర్ నీటిని అనధికారికంగా వినిగియోంచే వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల భారీ నిరసన

మొదటి పేజి తరువాయి



ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత లోపించిందని, అవకతవకలు జరుగుతున్నాయని విపక్షాలు గత కొద్ది వారాలుగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని కూడా వార్తలు వచ్చాయి.దీనిపై రాహుల్ సోషల్ మీడియాలోనూ స్పందించారు. "జ్ఞానేశ్, ఇక ముగిసింది. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తున్న వేళ, ఆయనకు ఊహించని రాజకీయ సెగ తగిలింది. ఒకప్పటి మిత్రపక్షమైన తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ, రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించింది.డీఎంకే నేత శరవణన్ అన్నదురై సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీని సూటిగా ప్రశ్నించారు. "తమిళనాడులో ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల తొలగింపుపై రాహుల్ గాంధీ వైఖరి ఏమిటి? 'సర్' అనంతరం ఎన్నికైన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయాలన్న మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలను ఆయన ఎందుకు సమర్థించడం లేదు? తమిళనాడులో 'సర్' గురించి మాట్లాడటానికి విజయ్‌కి భయపడుతున్నారా? ఇది ఎంతటి ద్వంద్వ నీతి" అని తన పోస్టులో ఘాటుగా విమర్శించారుఇటీవల తమిళనాడులో జరిగిన ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ, డీఎంకేతో పొత్తును తెంచుకోవడం తెలిసిందే. ఈ పరిణామంతో తీవ్ర అసంతృప్తికి లోనైన డీఎంకే, ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి నుంచి కూడా వైదొలగింది. సీఈసీకి వ్యతిరేకంగా సాగే పోరాటానికి తమ మద్దతు ఉంటుందని చెబుతూనే, తాజాగా రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకోవడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

భారత వాయుసేన నూతన అధిపతిగా అశుతోష్ దీక్షిత్

మొదటి పేజి తరువాయి

వైస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు, ఆయన చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్ వంటి పలు కీలక సైనిక చర్యల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా పరమ విశిష్ట సేవా పతకం (2026), అతి విశిష్ట సేవా పతకం (2023) వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.ప్రస్తుతం భారత వాయుసేన ఆధునికీకరణ, యుద్ధ విమానాల సంఖ్య పెంపు దిశగా అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో ఎయిర్ డిఫెన్స్, మానవరహిత యుద్ధ సామర్థ్యాల పెంపుదల, త్రివిధ దళాల మధ్య సమన్వయం వంటి అంశాలు ఆయన ముందున్న ప్రధాన సవాళ్లు. త్రివిధ దళాల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న దీక్షిత్ నియామకం, ఈ లక్ష్యాల సాధనకు ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

మొదటి పేజి తరువాయి



గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు.రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ కోటా..



అనంతరం మీడియాతో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని ప్రశ్నించారు. వారికి రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 34 శాతం కోటాను పునరుద్ధరిస్తే బీసీలకు సుమారు 16,800 పదవులు దక్కుతాయని... ఇది రాజకీయ అంశం కాదని, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. కొన్ని రాష్ట్రాలు బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే మార్గాలను అన్వేషిస్తున్నాయని, ప్రభుత్వం కూడా సమస్యను జఠిలం చేయకుండా పరిష్కారం కోసం చూస్తోందని వివరించారు.మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం చట్టాన్ని సవరించకుండానే రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి ఎందుకు తగ్గించిందని నిలదీశారు. దీనివల్ల వేలాది మంది బీసీ నేతలు పదవులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 1987లో టీడీపీనే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిందని, ఆ తర్వాత చంద్రబాబు హయాంలో దాన్ని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు.

దక్షిణ రాష్ట్రాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ డాక్టర్‌ను మోసం చేసి రూ.11 కోట్లు కాజేసిన కేసులో దర్యాప్తు

దుబాయ్, ఇతర దేశాల్లోని నేరగాళ్లతో సంబంధాలపై అధికారుల ఆరా

దేశవ్యాప్తంగా నమోదైన అనేక సైబర్ క్రైమ్ కేసులతో ఈ నెట్‌వర్క్‌కు సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడిని మోసం చేసి రూ. 11 కోట్లు కాజేసిన కేసు దర్యాప్తులో ఈ అరెస్టులు కీలకంగా మారాయి. బాధితుడి నుంచి దోచుకున్న డబ్బును ఈ మ్యూల్ ఖాతాల్లోకే బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. అరెస్ట్ అయిన వారందరినీ ట్రాన్సిట్ వారెంట్లపై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ మోసాల వెనుక దుబాయ్, ఇతర దేశాల్లోని సైబర్ నేరగాళ్ల హస్తం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.ఆన్‌లైన్ మోసాల ద్వారా సంపాదించిన డబ్బును దాచిపెట్టడానికి, తరలించడానికి సైబర్ నేరగాళ్లు ఈ మ్యూల్ ఖాతాలను ఉపయోగిస్తుంటారు. ఫిషింగ్, పెట్టుబడి మోసాల ద్వారా కొల్లగొట్టిన డబ్బును అసలు సూత్రధారులెవరో తెలియకుండా చేసేందుకు ఈ ఖాతాలు మాధ్యమంగా పనిచేస్తాయి. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసి, ప్రధాన నిందితులను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

బీసీ రిజర్వేషన్ల భయంతోనే వైసీపీ కోర్టులకు



మొదటి పేజి తరువాయి

బీసీల సంక్షేమం, వారి రాజకీయ సాధికారతపై వైసీపీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు, రాజ్యాంగ హక్కులకు అనుగుణంగానే తమ కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి అందాయని, 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని మండిపల్లి వివరించారు. గృహ నిర్మాణం, ఉద్యానవన రంగాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీలు పూర్తి సన్నద్ధంగా ఉన్నాయని, ప్రజల మద్దతుతో వార్డు స్థాయి నుంచి మేయర్ పదవి వరకు నిర్ణయాత్మక విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఏపీ పోలీసు వ్యవస్థలో కీలక మార్పు..

మొదటి పేజి తరువాయి

కొత్త పోస్టులు లేకుండా ఉన్నవాటితోనే సర్దుబాటు


రాష్ట్రంలో ఆరుకు చేరిన మొత్తం పోలీస్ కమిషనరేట్ల సంఖ్య

ఈ నూతన కమిషనరేట్లకు ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) లేదా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) స్థాయి అధికారులు కమిషనర్లుగా వ్యవహరిస్తారు. వీరికి భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 14(6) కింద ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలను కల్పిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ, పోలీసు జిల్లాల సరిహద్దులనే ఈ కొత్త కమిషనరేట్ల పరిధిగా నిర్ణయించారు.ఈ కమిషనరేట్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం కొత్తగా ఎలాంటి పోస్టులను సృష్టించకపోవడం గమనార్హం. ప్రస్తుతం వివిధ విభాగాల్లో అదనంగా ఉన్న క్యాడర్ పోస్టులనే సర్దుబాటు చేసి, వాటిని కమిషనర్ పోస్టులుగా మార్చారు. ఉదాహరణకు, తిరుపతి కమిషనర్ పోస్టుకు విజయవాడ జాయింట్ పోలీస్ కమిషనర్ పోస్టును, గుంటూరు కమిషనర్ పోస్టుకు శిక్షణ విభాగం డీఐజీ పోస్టును కేటాయించారు. అదేవిధంగా రాజమహేంద్రవరం, కర్నూలు కమిషనర్ పోస్టులను కూడా ఇతర విభాగాల నుంచి బదలాయించారు.తిరుపతి కమిషనరేట్ పరిధిలోకి తిరుమల, శ్రీకాళహస్తి, శ్రీసిటీ జోన్లు వస్తాయి. పెరుగుతున్న భక్తుల రద్దీ, ట్రాఫిక్, వీఐపీ భద్రత, శాంతిభద్రతల సమర్థ నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. గుంటూరు కమిషనరేట్ పరిధిలో గుంటూరు, అమరావతి, తెనాలి జోన్లు ఉంటాయి. రాజమహేంద్రవరం, కర్నూలు కమిషనరేట్ల పరిధిలోకి కూడా ఆయా నగరాలతో పాటు పరిసర ప్రాంతాలను చేర్చారు. పాలనా సౌలభ్యం, నేరాల నియంత్రణే లక్ష్యంగా ఈ విస్తరణ చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.ఇప్పటికే రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో పోలీస్ కమిషనరేట్లు ఉండగా, తాజా నిర్ణయంతో వాటి సంఖ్య ఆరుకు చేరింది. కేబినెట్ ఆమోదం తర్వాత ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్త కమిషనరేట్లకు అవసరమైన డీసీపీలు, ఏసీపీలు, ఇతర సిబ్బందిని కూడా సర్దుబాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.



3 గుంటలే భూమి.. 600 గజాలుగా విక్రయం!

నిజాంపేట్‌లో భూమి మోసంపై కేసు







- 363 చదరపు గజాల భూమిని 600 గజాలుగా చూపించారన్న ఆరోపణ
- రూ.75 లక్షలకు పైగా చెల్లించినా భౌతిక స్వాధీనం ఇవ్వలేదంటూ ఫిర్యాదు
- కొలన్ రాజమోహన్ రెడ్డి, హరితపై బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

సామాన్యుడి అస్త్రం / నిజాంపేట్ :

లేనిది ఉన్నట్లు.. కానిది అయినట్లు చూపించి భూమి విక్రయం చేశారంటూ నిజాంపేట్‌లో వెలుగుచూసిన వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీసింది. సర్వే నంబర్ 15లో వాస్తవంగా ఉన్న భూమి కంటే అధిక విస్తీర్ణాన్ని చూపించి విక్రయించారని, భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్న తర్వాత కూడా స్థలానికి భౌతిక స్వాధీనం ఇవ్వలేదని ఓ వ్యక్తి బాచుపల్లి పోలీసులను ఆశ్రయించారు.

ఫిర్యాదు ప్రకారం, కొలన్ హరిత, ఆమె భర్త కొలన్ రాజమోహన్ రెడ్డి సర్వే నంబర్ 15లోని స్థలానికి తామే యజమానులమని, సంబంధిత మున్సిపల్ అనుమతులు కూడా ఉన్నాయని నమ్మించినట్లు బాధితుడు పేర్కొన్నారు. వారి మాటలను నమ్మి రూ. 1.20 కోట్లకు ఆస్తి కొనుగోలుకు అంగీకరించినట్లు తెలిపారు. ఇందులో చెక్కుల ద్వారా రూ. 45.36 లక్షలు, నగదు రూపంలో రూ. 30 లక్షలు చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ అయింది.. స్థలం మాత్రం దక్కలేదా?

ఫిర్యాదు వివరాల ప్రకారం, 12-02-2025న డాక్యుమెంట్ నంబర్ 4081/25 ద్వారా సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ జరిగినప్పటికీ, ఆ తర్వాత స్థలానికి భౌతిక స్వాధీనం ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో వ్యవహారంపై ఆరా తీసిన బాధితుడికి భూమి విస్తీర్ణంపై అనుమానాలు తలెత్తినట్లు తెలుస్తోంది. కొలన్ రాజమోహన్ రెడ్డి వద్ద సర్వే నంబర్ 15లో వాస్తవంగా 3 గుంటలు, అంటే సుమారు 363 చదరపు గజాల భూమి మాత్రమే ఉందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. అయితే 2012లో తన భార్య కొలన్ హరితకు ఒకసారి 237 చదరపు గజాలు, మరోసారి 216 చదరపు గజాల స్థలాన్ని గిఫ్ట్ డీడ్ల ద్వారా బదలాయించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. ఈ రెండు విస్తీర్ణాలు కలిపితే 453 చదరపు గజాలు అవుతున్నాయని, అసలు అందుబాటులో ఉన్న భూమికంటే ఈ లెక్కలు ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదుదారు వాదించారు.

గిఫ్ట్ డీడ్లతో 600 గజాల అపార్ట్‌మెంట్?

ఈ గిఫ్ట్ డీడ్ల ఆధారంగా మొత్తం 600 చదరపు గజాల ఓపెన్ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతులు తీసుకున్నారని, అనంతరం అందులోని ఫ్లాట్లను పలువురికి విక్రయించినట్లు కూడా ఫిర్యాదులో ఆరోపించారు. వాస్తవ భూమి విస్తీర్ణం, గిఫ్ట్ డీడ్లు, నిర్మాణ అనుమతుల్లో చూపిన విస్తీర్ణం మధ్య భారీ వ్యత్యాసం ఉందని బాధితుడు పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న భూమికంటే ఎక్కువ విస్తీర్ణాన్ని పత్రాల్లో చూపించి, ఆ ఆధారంగా నిర్మాణ అనుమతులు పొందారా? అదే భూమిని పలుమార్లు లావాదేవీలకు ఉపయోగించారా? అనే ప్రశ్నలు ఇప్పుడు ఈ వ్యవహారంలో కీలకంగా మారాయి.

హైకోర్టు కేసు విషయమూ దాచారన్న ఆరోపణ

ఇదే ఆస్తికి సంబంధించి కొలన్ రాజమోహన్ రెడ్డి సోదరుడు కొలన్ మాణిక్య రెడ్డి తెలంగాణ హైకోర్టులో జ్యూ.చీశే.34567/2024 దాఖలు చేసిన విషయాన్ని కూడా కొనుగోలుదారునికి తెలియజేయలేదని ఫిర్యాదులో ఆరోపించారు. భవన నిర్మాణ అనుమతిని రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైనట్లు పేర్కొన్నారు.

ఆస్తికి సంబంధించి కోర్టు వివాదం కొనసాగుతున్న విషయాన్ని దాచిపెట్టి విక్రయం జరిపితే అది కొనుగోలుదారుని నిర్ణయాన్ని ప్రభావితం చేసే కీలక అంశమవుతుందని బాధితుడు పేర్కొన్నట్లు సమాచారం.

ప్రశ్నిస్తే బెదిరింపులంటూ ఫిర్యాదు

భూమి విస్తీర్ణం, పత్రాల్లోని వ్యత్యాసాలపై ప్రశ్నించగా దంపతులు దుర్భాషలాడుతూ బెదిరించారని కూడా ఫిర్యాదుదారు ఆరోపించారు. తప్పుడు వివరాలతో సేల్ డీడ్ రూపొందించి తమను మోసం చేశారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాచుపల్లి పోలీసులను ఆశ్రయించారు.

ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. అయితే భూమి అసలు విస్తీర్ణం ఎంత? గిఫ్ట్ డీడ్లు ఏ ఆధారంగా జరిగాయి? 600 చదరపు గజాలకు నిర్మాణ అనుమతులు ఎలా మంజూరయ్యాయి? కొనుగోలుదారునికి కోర్టు వివాదం వెల్లడించారా లేదా? అనే అంశాలు పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ మొత్తం వ్యవహారంపై సంబంధిత పత్రాలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, మున్సిపల్ అనుమతులు, రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తే అసలు నిజం బయటపడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ భూమి విక్రయ వివాదం నిజాంపేట్ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

జలసిరి కుంటల్లో గంగపుత్రులకు చేపల పెంపక హక్కు ఇవ్వాలి



- 50 వేల నీటి కుంటలను సంప్రదాయ మత్స్యకారుల ఉపాధికి అనుసంధానించాలి
- మత్స్యశాఖ అధికారులకు తెలంగాణ గంగపుత్ర సంఘం వినతి
- జలసిరి పథకంలోని నీటి కుంటల్లో చేపల పెంపకానికి గంగపుత్రులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్
- స్థానిక మత్స్యకార సంఘాలకు కుంటలను అప్పగిస్తే స్థిరమైన ఉపాధి, ఆదాయం
- మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. మురళీకృష్ణకు వినతిపత్రం

సామాన్యుడి అస్త్రం / హైదరాబాద్ :

రాష్ట్రవ్యాప్తంగా జలసిరి పథకం కింద నిర్మించనున్న నీటి కుంటలు కేవలం నీటి నిల్వ కేంద్రాలుగానే కాకుండా.. తరతరాలుగా మత్స్యకార వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గంగపుత్ర కుటుంబాలకు ఉపాధి కేంద్రాలుగా మారాలని తెలంగాణ గంగపుత్ర సంఘం కోరుతోంది. జలసిరి కింద నిర్మించనున్న సుమారు 50 వేల నీటి కుంటల్లో చేపల పెంపకం, సంరక్షణ, మత్స్య వేటకు సంప్రదాయ మత్స్యకారులైన గంగపుత్రులకు అవకాశం కల్పించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. మురళీకృష్ణను కలిసి తెలంగాణ గంగపుత్ర సంఘం తరఫున వినతిపత్రం అందజేశారు.

'కుంటలు నిర్మిస్తే సరిపోదు.. ఉపాధితో ముడిపెట్టాలి'

రాష్ట్రంలోని గంగపుత్ర కుటుంబాలు తరతరాలుగా చేపల వేట, చేపల పెంపకాన్నే జీవనాధారంగా చేసుకుని బతుకుతున్నాయని రాజేష్ ఖన్నా పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా పెద్ద సంఖ్యలో నీటి కుంటలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వాటిని సంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధితో అనుసంధానం చేయాలని కోరారు. జలసిరి కుంటల్లో చేప పిల్లల విడుదల నుంచి వాటి సంరక్షణ, పెంపకం, వేట వరకు స్థానిక గంగపుత్ర మత్స్యకారులకు ప్రాధాన్యం కల్పిస్తే పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అదనపు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.

స్థానిక సంఘాలకే నిర్వహణ ఇవ్వాలి

జలసిరి కింద ఏర్పాటయ్యే నీటి కుంటలను ఆయా ప్రాంతాల్లోని స్థానిక గంగపుత్ర మత్స్యకార సంఘాలకు అందుబాటులోకి తీసుకురావాలని సంఘం కోరింది. కుంటల నిర్వహణ, చేపల పెంపకం బాధ్యతలను వారికి అప్పగిస్తే ఏడాది పొడవునా ఆదాయ మార్గాలు ఏర్పడే అవకాశముందని రాజేష్ ఖన్నా పేర్కొన్నారు. ఇలా చేస్తే ఒకవైపు గంగపుత్ర కుటుంబాలకు స్థిరమైన ఉపాధి దొరకడంతో పాటు మరోవైపు సంప్రదాయ మత్స్యకార వృత్తికి ప్రభుత్వ పరిరక్షణ లభిస్తుందని చెప్పారు.

50 వేల కుంటలు.. వేల కుటుంబాలకు జీవనాధారం

జలసిరి పథకం ద్వారా సుమారు 50 వేల నీటి కుంటలు నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యం అమలైతే వాటిలో మత్స్య సంపద అభివృద్ధికి విస్తృత అవకాశం ఉంటుందని సంఘం అభిప్రాయపడింది. ఈ అవకాశాలను బయట వ్యక్తులకు కాకుండా సంప్రదాయంగా మత్స్యకార వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు అందించాలని కోరింది. చేపల పెంపకంలో అనుభవం ఉన్న గంగపుత్రులను భాగస్వాములను చేస్తే కుంటల వినియోగం కూడా మెరుగుపడుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మత్స్య రంగం వాటా పెరుగుతుందని పేర్కొంది.

ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి

జలసిరి పథకంలోని నీటి కుంటల్లో చేపల పెంపకం, సంరక్షణ, మత్స్య వేటకు గంగపుత్రులకు ప్రాధాన్యం కల్పించేలా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని రాజేష్ ఖన్నా కోరారు. స్థానిక మత్స్యకార సంఘాలకు కుంటలను కేటాయించడం, చేప పిల్లల సరఫరా, అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు తీసుకుంటే గంగపుత్ర కుటుంబాలకు జలసిరి నిజమైన జీవనోపాధి పథకంగా మారుతుందని తెలిపారు. గంగపుత్రుల అభ్యర్థనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, జలసిరి నీటి కుంటలను సంప్రదాయ మత్స్యకారుల ఉపాధికి ఉపయోగపడేలా నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ గంగపుత్ర సంఘం కోరింది.

కుప్పల తెప్పలగా నోటీసులు జారీ..

మరి చర్యలలో మౌనమెందుకు





శేరిలింగంపల్లి ఎంఈఓ కార్యాలయంలో ఏమి జరుగుతుంది

- ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘాల చేతికే స్కూళ్ల నోటీసులు ఇస్తున్నారంటూ ఆరోపణ
- నోటీసులు సరే.. వాటిపై తీసుకున్న చర్యల వివరాలేవంటున్న విద్యార్థి సంఘం
- అస్త్రం డైలీ ప్రశ్నలకు ఎంఈఓ సమాధానాలతో మరిన్ని సందేహాలు

సామాన్యుడి అస్త్రం / శేరిలింగంపల్లి :

పాఠశాలల్లో నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదు వస్తే పరిశీలించాలి లోపాలు ఉంటే నోటీసు ఇవ్వాలి యాజమాన్యం నుంచి వివరణ తీసుకోవాలి ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చర్యలు చేపట్టాలి. ఇదంతా అధికారిక రికార్డుల్లో నమోదవ్వాలి. కానీ శేరిలింగంపల్లి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి జారీ అవుతున్న నోటీసుల విషయంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందంటూ విద్యార్థి సంఘాల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మూడు నెలల్లో సుమారు 65 నోటీసులు జారీ చేసినట్లు చెబుతున్నప్పటికీ, వాటిలో ఎన్ని పాఠశాలలపై తదుపరి చర్యలు తీసుకున్నారన్నది స్పష్టంగా తెలియడం లేదని దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో అనుమతులు, నిబంధనల ఉల్లంఘనలపై తమ సంఘం ఎంఈఓ కార్యాలయానికి ఫిర్యాదులు చేసిందని, వాటి ఆధారంగా నోటీసులు సిద్ధం చేసిన అధికారులు సంబంధిత పాఠశాలలకు అధికారిక సిబ్బంది ద్వారా వాటిని పంపకుండా ఫిర్యాదు చేసిన వారి చేతికే నోటీసులు ఇచ్చి స్కూల్‌కు అందించాలని చెప్పారని విద్యార్థి సంఘం చెబుతుంది. ఒక పాఠశాలపై ఫిర్యాదు చేసిన వ్యక్తే అదే పాఠశాలకు నోటీసు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించగా, అవును కానీ ఎదో ఒకసారి జరిగినా దానికోసం ఇప్పుడెందుకు అంటూ సమాధానమిచ్చిన ఎం ఈ ఓ. నోటీసు ఎప్పుడు జారీ అయింది? ఎవరి ద్వారా పంపారు? ఎవరు స్వీకరించారు? అక్నౌలెడ్జ్‌మెంట్ తీసుకున్నారా? అవుట్ వార్డు రిజిస్టర్ లో నమోదు చేశారా? అనే వివరాలు బయటపెడితే అసలు విషయం తేలిపోతుందని అంటున్నారు.

అయిపోయాయి.. ఇప్పుడు ఏం చేద్దాం?

ఇదే అంశంపై సామాన్యుడి అస్త్రం రిపోర్టర్ ఎంఈఓను ఫిర్యాదు చేసిన వ్యక్తుల చేతికే సంబంధిత స్కూల్ నోటీసులు ఇచ్చి పంపించడం ఎలా అని అడిగగా. దీనికి పూర్తి వివరణ ఇవ్వాల్సిన ఎంఈఓ, అవన్నీ అయిపోయాయి.. అయితే ఇప్పుడు ఏం చేద్దాం? అని స్పందించినట్లు రిపోర్టర్ తెలియజేశారు. జరిగిన విషయం అయిపోయిందని చెప్పడంతో అధికారిక ప్రక్రియపై వచ్చిన సందేహాలకు సమాధానం దొరికినట్లు కాదని విద్యార్థి సంఘం అంటోంది. ప్రభుత్వ కార్యాలయం నుంచి బయటకు వెళ్లే ప్రతి నోటీసుకు ఒక లెక్క, దాని తర్వాత జరిగిన చర్యకు మరో లెక్క ఉండాల్సిందేనని చెబుతోంది. ఇదే సమయంలో మరో ప్రైవేటు పాఠశాలపై ఇచ్చిన ఫిర్యాదు విషయంలో ఏం చర్య తీసుకున్నారని అస్త్రందైలీ రిపోర్టర్ ప్రశ్నించగా, ఆ స్కూల్‌కు అన్ని పర్మిషన్లు ఉన్నాయి అని ఎంఈఓ సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. దీంతో అన్ని అనుమతులు ఉన్నాయని చెబుతున్న పాఠశాలకు మరి నోటీసు ఎందుకు ఇచ్చారు? అని తిరిగి ప్రశ్నించగా అదేమీ లేదే అని నీల్లునములుతున్నారు. ఒకవైపు ఫిర్యాదు ఆధారంగా నోటీసు మరోవైపు అన్ని అనుమతులు ఉన్నాయన్న సమాధానం ఈ రెండింటిలో అధికారిక రికార్డులు ఏం చెబుతున్నాయన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.

65 నోటీసులు.. యాక్షన్ ఎక్కడ?

మూడు నెలల్లో సుమారు 65 నోటీసులు జారీ అయ్యాయన్న అంశమే ఇప్పుడు ఈ వ్యవహారంలో కీలకంగా మారుతోంది. నోటీసులు ఇవ్వడం మాత్రమే అధికారుల బాధ్యతను పూర్తి చేయదు. ఆయా పాఠశాలలు ఇచ్చిన వివరణ ఏమిటి? అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారా? ఉల్లంఘనలు గుర్తించారా? గుర్తిస్తే ఏ చర్య తీసుకున్నారు? అనుమతులు సక్రమంగా ఉంటే కేసును ఏ ప్రాతిపదికన ముగించారు? అనే వివరాలు కూడా ఉండాలి. 65 నోటీసులకు సంబంధించిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ బయటపెడితే ప్రస్తుతం వస్తున్న అనేక ఆరోపణలకు సమాధానం దొరుకుతుందని విద్యార్థి సంఘం పేర్కొంటోంది.

ఇక పాఠశాలలకు ఇచ్చే నోటీసుల పేరుతో డబ్బుల వసూళ్లు జరుగుతున్నాయంటూ కిరణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అయినప్పటికీ నోటీసుల జారీ, వాటి పంపిణీ, తదుపరి చర్యలకు సంబంధించిన పూర్తి రికార్డులపై ఉన్నతాధికారులు విచారణ జరిపితే ఆరోపణల్లో నిజానిజాలు బయటపడతాయని కిరణ్ కుమార్ కోరుతున్నారు.

ఔట్ వార్డ్ రిజిస్టర్ అడిగితే.. మీకు అవసరం లేదు?

మూడు నెలల్లో ఇన్ని నోటీసులు జారీ అయితే వాటికి సంబంధించిన ఔట్వార్డ్ రిజిస్టర్ నిర్వహిస్తున్నారా అని విద్యార్థి సంఘనాయకులు ఎంఈఓను ప్రశ్నించినట్లు తెలిపారు. దీనికి రికార్డుల వివరాలను చెప్పకుండా అవన్నీ మీకు అవసరం లేదు అని ఎంఈఓ అన్నారు. ప్రభుత్వ కార్యాలయం నుంచి వెళ్లే అధికారిక నోటీసుల విషయంలో వాటి జారీ తేదీ, సంబంధిత పాఠశాల, పంపిన విధానం, స్వీకరించిన వివరాలు, అనంతరం తీసుకున్న చర్య వంటి అంశాలు రికార్డుల్లో ఉంటే ఆ నోటీస్లు చట్టబద్దంగా వెళ్ళినట్టు పరిగణించాలి కానీ కేవలం ధనార్జనే లాభంగా చూస్తున్న ఏం ఈ ఓ ఎన్ని నోటీస్ లను ఆన్ రెకోర్డే పంపరో వాటిని పరిశీలించడం ద్వారా ఈ వివాదానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ ప్రశ్న వ్యక్తుల గురించి మాత్రమే కాదు.. వ్యవస్థ ఎలా పనిచేస్తోందన్నదే అసలు అంశం. మూడు నెలల్లో సుమారు 65 నోటీసులు నిజంగానే జారీ అయితే వాటిలో ఎన్ని పాఠశాలలపై చర్యలు తీసుకున్నారు? ఫిర్యాదు చేసిన వారి చేతికే నోటీసులు ఇచ్చిన సందర్భాలు ఎన్ని? అన్ని అనుమతులు ఉన్నాయని చెబుతున్న పాఠశాలకు నోటీసు ఎందుకు వెళ్లింది? నోటీసుల తర్వాత యాక్షన్ టేకెన్ రిపోర్ట్స్ ఎక్కడ? అనే విద్యార్థి సంఘాలు అడుగుతున్న ప్రశ్నలకు సంబంధిత రికార్డులతో విద్యాశాఖ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇది ఆరంభం మాత్రమే. శేరిలింగంపల్లి విద్యాశాఖలో పాఠశాలలకు జారీ చేసిన నోటీసులు, వాటి వెనుక ఉన్న ఫిర్యాదులు, అనుమతుల పరిస్థితి, అనంతరం తీసుకున్న చర్యలను ఒక్కో ఆధారంతో మన తెలంగాణలో ప్రత్యేక కథనాల ద్వారా పాఠకుల ముందుకు తీసుకురానుంది.



దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్

సింగరేణి కార్మికుల సంక్షేమానికి భరోసా





15 రోజుల్లో పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల పరిష్కారం

ఏరియా ఆసుపత్రుల్లోనే మెడికల్ బోర్డులు.. కాలనీల ఆధునికీకరణ

గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్.. కార్మికుల భద్రతపై రాజీ వద్దు

సింగరేణి కార్మికుల సమస్యలపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 6సామాన్యుడి అస్త్రం

సింగరేణి బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కార్మికుల ఉద్యోగ, వైద్య, నివాస, ఆరోగ్య సమస్యలతో పాటు సింగరేణి ప్రాంతాల అభివృద్ధిపై సమగ్రంగా దృష్టి సారించారు. మంగళవారం ప్రజాభవన్‌లో సింగరేణి ప్రాంత మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి, పలువురు ఎమ్మెల్యేలు, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్‌తో పాటు సింగరేణి ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లతో పాటు వాటికి సంబంధించిన లీగల్ ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేసి అభ్యర్థులకు ఉద్యోగాలు అందించాలని భట్టి అధికారులను ఆదేశించారు. డిపెండెంట్ ఉద్యోగుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు 136 నుంచి గరిష్టంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించాలని సూచించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. అక్కడే వీలైనంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

డిస్మిస్ అయిన వారికి వన్‌టైం చాన్స్

కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరు కాలేక ఉద్యోగాల నుంచి తొలగించబడిన కార్మికులను వన్‌టైం ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అదే సమయంలో విధులకు హాజరు కాకుండా సమ్మెలకు పిలుపునిచ్చిన లేదా సమ్మెల్లో పాల్గొన్న అధికారులపై, నాయకత్వం వహించిన వారిపై నాన్ మెయింటెనెన్స్ ఆఫ్ డ్యూటీస్ కింద హెచ్చరిక జారీ చేయాలని సూచించారు. సింగరేణికి కేటాయించిన భూముల్లో 5,774 ఎకరాలను సంస్థ తిరిగి రెవెన్యూ శాఖకు అప్పగించిందని సమావేశంలో వివరించారు. ఇందులో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పేదలకు పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాల్లో జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని భట్టి ఆదేశించారు. సింగరేణి అధికారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఆక్రమణలో ఉన్న నివాసితుల ప్రాథమిక జాబితాను రూపొందించాలని, స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి అర్హులైన లబ్ధిదారుల సమగ్ర జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను ఒక నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సింగరేణికి చెందిన భూముల్లో ఇప్పటివరకు మైనింగ్ చేయని ప్రాంతాలను గుర్తించి కార్మికులు, ఉద్యోగుల ఇళ్ల నిర్మాణానికి లేఅవుట్లు సిద్ధం చేయాలని భట్టి సూచించారు. నెహ్రూ హౌసింగ్ కాలనీల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. శిథిలమైన డి-టైప్ క్వార్టర్లను తొలగించి వాటి స్థానంలో అన్ని వసతులతో ఆధునిక క్వార్టర్లను నిర్మించాలని చెప్పారు. సింగరేణి కాలనీలన్నింటినీ ఆధునికీకరించాలని, అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థ, విద్యుదీకరణ, పారిశుధ్యం, మంచినీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. కాలనీల్లో మురుగు శుద్ధి కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు.

సింగరేణి ఆసుపత్రులకు కార్పొరేట్ హంగులు

సింగరేణి ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయాలని భట్టి ఆదేశించారు. సాధారణ కార్మికుడు కూడా ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందేలా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అవసరమైతే వైద్యుల వేతనాలు, పరిహారాలను పెంచి నిపుణులైన వైద్యులను నియమించాలని చెప్పారు. అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్‌ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. బొగ్గు గనులు, ఓవర్ బర్డెన్ డంప్‌ల నుంచి వెలువడే దుమ్ము కారణంగా ప్రాంతీయ ప్రజల్లో క్యాన్సర్ ముప్పు పెరుగుతోందని పలు అధ్యయనాలు సూచిస్తున్న నేపథ్యంలో సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ప్రతి గ్రామానికి వెళ్లి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని భట్టి ఆదేశించారు. సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలను సోలరైజ్ చేయాలని సూచించారు. సింగరేణి పరిధిలోని ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని భట్టి ఆదేశించారు. రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు భట్టి విక్రమార్క గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. భూపాలపల్లి నియోజకవర్గంలో అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటుకు సింగరేణి నుంచి భూమి కేటాయించాలని, అందుకు ప్రత్యామ్నాయంగా రెవెన్యూ శాఖలోని నిరుపయోగ గుట్టల భూములపై నివేదిక ఇవ్వాలని సూచించారు. సింగరేణి కార్మికులకు భద్రతా పరికరాలు అత్యంత కీలకమని పేర్కొంటూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా సేఫ్టీ కిట్లు పంపిణీ చేయాలని భట్టి ఆదేశించారు. కార్మికుల భద్రత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. సింగరేణి ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగానే కార్మికులందరికీ సంబంధించిన ఆదాయపన్నును కూడా సంస్థే ప్రభుత్వానికి చెల్లించాలని భట్టి ఆదేశించారు. సత్తుపల్లి, భూపాలపల్లి ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు ఆయా నియోజకవర్గాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి సింగరేణి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని సూచించారు. కార్మికులు, వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఆధునిక కాలనీలు, మెరుగైన వైద్యం, సురక్షితమైన పని వాతావరణం, విద్యా--తాగునీటి సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్తు లేదు

సూర్యాపేట, అక్టోబర్ 6 (తెలుగుప్రభ): పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయని బీఆర్ఎస్.. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీలేని రుణాలను కొనసాగిస్తారా? అని ప్రశ్నించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని.. బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం మునగాలలో రూ.9.60 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి భట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. మునగాల కిచెన్ ద్వారా సుమారు 60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని, ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

27 లక్షల మందికి అల్పాహారం

రాష్ట్రంలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు పౌష్టికాహారం అందిస్తున్నామని భట్టి తెలిపారు. మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ ఇస్తున్నామని చెప్పారు. పిల్లలకు అందిస్తున్న ఆహారం ఖర్చు కాదని.. రాష్ట్ర భవిష్యత్తు మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడి అని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి నాణ్యమైన విద్యను అభ్యసిస్తే రాష్ట్ర ఉత్పాదకత, జీఎన్‌డీపీ వృద్ధికి దోహదపడతారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను 'ఉచితాలు'గా చూడొద్దని, పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులపై చేస్తున్న వ్యయం భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూర్చే పెట్టుబడి అని భట్టి వివరించారు. ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని నవంబర్ 19న ప్రారంభించనున్నట్లు తెలిపారు. కుటుంబ యజమాని ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షల ఆర్థిక భద్రత కల్పించేలా పథకాన్ని రూపొందిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని భట్టి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులు సమాన అవకాశాలతో చదివేలా వీటిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

నాణ్యమైన ఆహారం, విద్యే లక్ష్యం: ఉత్తమ్

గ్రామీణ విద్యార్థులకు పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి విజ్ఞప్తి మేరకు సింగరేణి సంస్థ ఈ ప్రాజెక్టుకు రూ.9.60 కోట్ల ఆర్థిక సహకారం అందిస్తోంది. మునగాల కిచెన్ ద్వారా జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు అల్పాహారంతోపాటు పాలు, రాగిజావ అందించనున్నట్లు ఉత్తమ్ తెలిపారు. ఆహార నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. విద్యతోపాటు పౌష్టికాహారం అందితే విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, లెర్నింగ్ కెపాసిటీ మెరుగుపడుతుందన్నారు. అవసరాన్ని బట్టి ఎంపిక చేసిన జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనాన్ని విస్తరించే అవకాశం ఉందని తెలిపారు. గడ్డిపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను రూ.200 కోట్లతో నిర్మిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని ఉత్తమ్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 105 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, గ్రామీణ విద్యార్థులకు ప్రముఖ పాఠశాలలతో సమానమైన విద్య, వసతి, క్రీడా సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏడాదిలోపే లబ్ధిదారుల చేతికి తాళాలందిస్తాం..

మేడ్చెల్‌సామాన్యుడి అస్త్రం

ఏడాది లోపు ఇందిరమ్మ టవర్స్ ను నిర్మించి ఇళ్ళు లేని పేద ప్రజలకు తాళాలందిస్తామని, ఇందిరమ్మ టవర్స్ నిర్మించే కాంట్రాక్టర్ లకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహకాలు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు,రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని వివరించారు.మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి,జిల్లా ఇన్‌ఛార్జి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే కే.పీ, వివేకానంద,పలువురు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం7,000 మందికి పైగా దరఖాస్తులు అందగా,పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి,480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు.ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని,ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు.ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని,మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు.ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని,దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర



ప్రభుత్వ,హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని అన్నారు.ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు.ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి. నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలని అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు.పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు.పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా, కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు.అనంతరం పలువురు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు

కొత్త స్టేషన్‌కు కొత్త సారథి..
ఇస్నాపూర్ సీఐగా మహేష్ బాధ్యతలు



- **నూతనంగా ఏర్పాటైన ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్‌కు సీఐగా బాధ్యతల స్వీకరణ**
- **శాంతిభద్రతలు, నేరాల నియంత్రణపై స్థానికుల్లో పెరిగిన అంచనాలు**
- **ప్రజలకు మరింత చేరువగా పోలీసింగ్ సాగాలన్న ఆకాంక్ష**

సామాన్యుడి అస్త్రం / ఇస్నాపూర్ :

నూతనంగా ఏర్పాటైన ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్‌కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మహేష్ బాధ్యతలు స్వీకరించారు. కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటు తర్వాత స్థానికంగా పోలీసింగ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్న అంచనాల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఇస్నాపూర్ ప్రాంతం వేగంగా విస్తరిస్తుండటంతో జనాభాతో పాటు వాహనాల రాకపోకలు, వ్యాపార కార్యకలాపాలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ సమస్యలు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలు కొత్త పోలీస్ స్టేషన్‌కు కీలకంగా మారనున్నాయి.సీఐగా మహేష్ బాధ్యతలు చేపట్టడంతో స్టేషన్ పరిధిలో పోలీస్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంపై దృష్టి సారించే అవకాశం ఉంది. ముఖ్యంగా కాలనీలు, ప్రధాన రహదారులు, వాణిజ్య ప్రాంతాల్లో నిఘా పెంచడంతో పాటు ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.కొత్తగా ఏర్పాటైన పోలీస్ స్టేషన్ కావడంతో ప్రజలతో సమన్వయం, ఫిర్యాదులకు వేగంగా స్పందించడం, నేరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త స్టేషన్‌కు సీఐగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ పనితీరు ఇప్పుడు స్థానికంగా ఆసక్తికరంగా మారింది.

దుర్గం చెరువు అభివృద్ధికి స్పెషల్ పర్పస్ వెహికల్.. సీఏంసీ కీలక నిర్ణయం



దుర్గం చెరువు అభివృద్ధికి స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు

140 ఎకరాల్లో అభివృద్ధి పనులకు సీఏంసీ స్థాయీ సంఘం ఆమోదం

చెరువులోకి మురుగునీటిని అరికట్టేందుకు కొనసాగుతున్న ప్రయత్నాలు

చింతల కుంట చెరువు పునరుద్ధరణకు రూ.21.59 కోట్లు కేటాయింపు

పలు అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్‌లోని ప్రఖ్యాత దుర్గం చెరువు సమగ్ర అభివృద్ధి, పునరుద్ధరణ కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఏంసీ) సిద్ధమవుతోంది. సుమారు 140 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రతిపాదనకు సోమవారం జరిగిన సీఏంసీ స్థాయీ సంఘం సమావేశంలో ఆమోదం లభించిందని అధికారులు తెలిపారు. ఈ ఎస్పీవీ ద్వారా చెరువు అభివృద్ధి ప్రాజెక్టును ప్రత్యేకంగా చేపట్టడంతో పాటు, ఈ కార్యక్రమానికి అవసరమైన నిధుల సమీకరణ కూడా సులభతరం అవుతుందని భావిస్తున్నారు.దుర్గం చెరువులోకి మురుగునీరు చేరకుండా అరికట్టేందుకు అధికారులు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే చెరువు చుట్టూ నాలుగు ప్రధాన మురుగునీటి మార్గాలను గుర్తించి, వాటిని అడ్డగించి శుద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించారు. గతంలోనూ దుర్గం చెరువు చుట్టూ వాకింగ్, జాగింగ్ ట్రాక్‌లు, ఇతర ప్రజా సౌకర్యాలు కల్పించారు. తాజా నిర్ణయంతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి.ఇదే సమావేశంలో మరికొన్ని కీలక ప్రతిపాదనలకు కూడా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. చింతల కుంట చెరువు పునరుద్ధరణ కోసం రూ.21.59 కోట్లు, కూకట్‌పల్లి జోన్‌లో బాక్స్ డ్రెయిన్ పనుల పూర్తికి రూ.5.95 కోట్లు, గజూలరామారం సర్కిల్ ఆఫీస్ భవన నిర్మాణానికి రూ.5.18 కోట్లు కేటాయించారు. మున్సిపల్ సమస్యలకు సాంకేతిక పరిష్కారాల కోసం తెలంగాణ ప్రభుత్వ సంస్థ అయిన టీ-వర్క్స్‌తో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ)కు కూడా ఆమోదం లభించింది.ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఏంసీ కమిషనర్ జి.శ్రీజన, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ మేరకు డెక్కన్ క్రానికల్ తన కథనంలో వెల్లడించింది.

ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం: తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు



తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు

నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లు సమర్పించారని నిర్ధారణ

కాంట్రాక్టు నుంచి రెగ్యులరైజ్ అయ్యాక వెలుగులోకి బాగోతం

మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లపై కొనసాగుతున్న విచారణ

ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ విచారణకు జేఏసీ డిమాండ్

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు.ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు.ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌కు తాగునీటి గండం..

డిసెంబర్‌కే సంక్షోభం తప్పదా?

వేగంగా అడుగంటుతున్న సింగూర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలు

మరో 60 రోజుల్లో సింగూర్ ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన

డిసెంబర్ నుంచే నీటి కష్టాలు తప్పవని అధికారుల హెచ్చరిక

అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయాలని జలమండలి ఆదేశం



హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

భాగ్యనగరానికి తాగునీటి గండం పొంచి ఉంది. ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్ నగరంలో తీవ్రమైన తాగునీటి సంక్షోభం తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావంతో నగరం యొక్క ప్రధాన నీటి వనరులైన జలాశయాల్లో నీటిమట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. అధికారులు ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు.

సింగూర్‌కు ముప్పు.. ఐటీ కారిడార్‌పై ప్రభావం

హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్, పశ్చిమ ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే కీలకమైన సింగూర్ జలాశయం పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.9 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 3.9 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది మొత్తం సామర్థ్యంలో కేవలం 13 శాతం మాత్రమే. వేసవిలో ఉన్న నీటి నిల్వలతో పోలిస్తే ఇది సగానికి పడిపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి కొనసాగితే మరో 60 రోజుల్లో, అంటే డిసెంబర్ మధ్య నాటికే సింగూర్ జలాశయం పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని అధికారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని జలాశయాల్లో ఇదే పరిస్థితి

పాతబస్తీ, చుట్టుపక్కల ప్రాంతాలకు నీరందించే మరో ముఖ్యమైన వనరు ఉస్మాన్‌సాగర్ (గండిపేట) నీటిమట్టం కూడా గణనీయంగా తగ్గింది. గతంలో సుమారు 3.5 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ ఇప్పుడు 2.2 టీఎంసీలకు పడిపోయింది. వీటికి తోడు, నాగార్జున సాగర్‌తో అనుసంధానమైన జలాశయాలతో సహా ఇతర ప్రధాన రిజర్వాయర్లకు కూడా ఇన్‌ఫ్లోలు (నీటి చేరిక) భారీగా తగ్గిపోయాయి. దీంతో నగరంపై నీటి సంక్షోభ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి.

అప్రమత్తమైన జలమండలి, ప్రభుత్వం

పరిస్థితి తీవ్రతను గ్రహించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) వెంటనే అప్రమత్తమైంది. సింగూర్, మంజీరా జలాలపై ఆధారపడిన ప్రాంతాలకు ప్రత్యామ్నాయ నీటి వనరులు, సరఫరా మార్గాలను గుర్తించి, అత్యవసర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.సాధారణంగా వేసవి కాలంలో ఎదురయ్యే నీటి ఎద్దడి, ఈసారి ముందుగానే డిసెంబర్ లేదా జనవరి నెలల నుంచే ప్రారంభమయ్యే అవకాశం ఉందని నీటిపారుదల శాఖకు చెందిన ఓ చీఫ్ ఇంజనీర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 17 శాతం వర్షపాతం లోటు ఉందని అధికారికంగా ప్రకటించింది. వ్యవసాయ అవసరాల కంటే తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. మొత్తం మీద రాబోయే రోజుల్లో భాగ్యనగర వాసులు నీటి కష్టాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

భూమికి బదులుగా అభివృద్ధి చేసిన ప్లాట్లు.. తెలంగాణలో కొత్త ల్యాండ్ పూలింగ్ పాలసీ?



తెలంగాణలో రాష్ట్రవ్యాప్త ల్యాండ్ పూలింగ్‌కు కొత్త పాలసీ తెచ్చే యోచన

భూమికి బదులుగా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని ప్లాన్

మూసీ, హెచ్ఎండీఏ ప్రాజెక్టుల్లో ఇప్పటికే అమలు

పట్టా భూముల యజమానులతో పాటు ఇతర భూములకు కూడా ప్రయోజనం

స్వచ్ఛందంగా పూలింగ్‌తో పాటు ప్రభుత్వమూ చేపట్టేలా విధానం

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు భూసేకరణ ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. భూములు తీసుకుని డబ్బులు చెల్లించే విధానానికి బదులుగా.. భూయజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చేలా రాష్ట్రవ్యాప్తంగా కొత్త ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకురానున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం మూసీ ప్రక్షాళన, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ పరిధిలోని కొన్ని ప్రాజెక్టుల్లో ఈ విధానం అమలవుతోంది. అక్కడ మంచి ఫలితాలు వస్తే రాష్ట్రంలోని సాగునీరు, రహదారులు, భవనాలు సహా వివిధ శాఖల ప్రాజెక్టులకు దీనిని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇందుకోసం తెలంగాణ సమగ్ర ప్రాంత అభివృద్ధి, ప్రణాళిక బిల్లు-2026ను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే హెచ్ఎండీఏ, పట్టణాభివృద్ధి సంస్థలు, జిల్లా కలెక్టర్లు సహా ప్రభుత్వం గుర్తించే ఇతర సంస్థలు ల్యాండ్ పూలింగ్ చేపడతాయి.రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, ప్రతిపాదిత బుల్లెట్ రైలు టెర్మినల్ వంటి ప్రాజెక్టులకు వేల ఎకరాలు అవసరం. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో భూముల అవసరం ఎక్కువగా ఉంది. దీంతో ప్రభుత్వం ఈ విధానంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.ఈ పథకంలో పట్టా భూముల యజమానులతో పాటు అసైన్డ్ భూములు, సీలింగ్ మిగులు భూములు, భూదాన్ భూములు, కొన్ని ప్రభుత్వ భూముల ఆక్రమణదారులకు కూడా ప్రయోజనం కల్పించనున్నారు. అయితే తిరిగి ఇచ్చే భూమి విస్తీర్ణం, భూమి హక్కు, ప్రాంతాన్ని బట్టి మారుతుంది.ఈ విధానంలో రెండు మార్గాలను ప్రతిపాదించారు. యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పూలింగ్ కోరితే దాన్ని 'కన్సెంట్ బేస్డ్ ల్యాండ్ పూలింగ్'గా పరిగణిస్తారు. రింగ్ రోడ్లు, పారిశ్రామిక కారిడార్లు, కొత్త పట్టణాల వంటి కీలక ప్రాంతాల్లో ప్రభుత్వం స్వయంగా చేపట్టే పూలింగ్‌ను 'గైడెడ్ ల్యాండ్ పూలింగ్'గా పేర్కొన్నారు.మూసీ ప్రాజెక్టు, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ ప్రాజెక్టులకు ఇప్పటికే ప్రభుత్వం జీవో 240, జీవో 243 జారీ చేసింది. వీటి ప్రకారం పట్టా భూములకు ఎకరానికి గరిష్ఠంగా 1,400 చదరపు గజాలు లేదా అభివృద్ధి చేసిన భూమిలో 50 శాతం వాటా.. ఏది తక్కువైతే అది లభిస్తుంది. సరస్సులు, నదుల బఫర్ ప్రాంతాల్లో ఎకరానికి 800 చదరపు గజాలు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో 400 చదరపు గజాల వరకు ఇవ్వనున్నారు.భూసేకరణ చట్టాన్ని పక్కన పెట్టేందుకే ఈ విధానం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలకు నోటీసులు, అభ్యంతరాలకు అవకాశం, పరిహారం, పునరావాసం వంటి నిబంధనలు కొనసాగుతాయని చెబుతున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు

సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారన్నది ప్రధాన ఆరోపణ

ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

ఈ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ వివాదాస్పద బ్యానర్లు ఏర్పాటు చేసిన కేసులో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి వద్ద అభ్యంతరకర రీతిలో బ్యానర్లు ప్రదర్శించారన్న అభియోగంపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, మెడికవర్ ఆసుపత్రికి సంబంధించి రూ. 13,200 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపిస్తూ క్రిశాంక్ తన అనుచరులతో కలిసి ఆసుపత్రి వెలుపల బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఉపయోగిస్తూ, ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లుగా వ్యంగ్యంగా వీటిని రూపొందించారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి కుమార్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 5న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రిశాంక్, 'వీ= మీడియా తెలంగాణ" ప్రతినిధులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 353(2), 352 కింద కేసులు నమోదయ్యాయి

తెలంగాణలో డైనోసార్లు తిరిగాయా? మంచిర్యాల అడవుల్లో దాగిన కోట్ల ఏళ్ల రహస్యం!


వేమనపల్లి ప్రాంతంలో డైనోసార్ అవశేషాల గుర్తింపు

1984లో అవశేషాలు బయటపడినట్లు సమాచారం

ప్రాణహిత పరివాహకంలో శిలాజాల ఆనవాళ్లు

రాజారంలో కాకతీయుల కాలం నాటి విగ్రహాలు

12వ శతాబ్దానికి చెందిన దశావతార విగ్రహాలు



హైదరాబాద్‌సామాన్యుడి అస్త్రం

తెలంగాణ అంటే చారిత్రక కోటలు, దేవాలయాలు, పచ్చని అడవులు గుర్తొస్తాయి. కానీ.. ఈ నేలపై కోట్ల ఏళ్ల క్రితం డైనోసార్లు సంచరించాయంటే నమ్మగలరా? మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి ప్రాంతం అలాంటి ఆసక్తికర విషయాలను తనలో దాచుకుంది. ప్రాణహిత నది పరీవాహక ప్రాంతంలో డైనోసార్ అవశేషాలు, వివిధ జీవుల శిలాజాలు బయటపడినట్లు స్థానిక కథనాలు చెబుతున్నాయి. అదే ప్రాంతంలో కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లు కూడా ఉండటం విశేషం.

డైనోసార్ అవశేషాలు

మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ప్రాణహిత నది ప్రవహించే ప్రాంతమే వేమనపల్లి. 1984లో మంగెనపల్లి అటవీ ప్రాంతంలో భూగర్భ, పురావస్తు శాఖ అధికారులు డైనోసార్ అవశేషాలను గుర్తించారు. సుమారు 14 మీటర్ల పొడవు, 5.5 మీటర్ల ఎత్తు ఉన్న జీవికి చెందిన అవశేషాలు బయటపడటంతో అప్పట్లో సంచలనం రేగింది. సుంపుటం, ఒడ్డుగూడెం, మంగెనపల్లి ప్రాంతాల్లోనూ అవశేషాలు లభించినట్లు స్థానికులు చెబుతున్నారు.

రాళ్లలో దాగిన జీవం

వేమనపల్లి పరిసరాల్లో శిలాజీకరణ చెందిన చెట్ల ఆనవాళ్లు కూడా కనిపిస్తాయని స్థానికులు చెబుతున్నారు. వాగులు, నది మలుపుల వెంట వివిధ ఆకారాల్లో రాళ్లు కనిపిస్తుంటాయి. వాటిలో కొన్ని చేపలు, సముద్ర నక్షత్రాలు, తాబేళ్ల ఆకారాలను పోలి ఉంటాయని చెబుతున్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో చెట్లు ఇసుక పొరల్లో కూరుకుపోయి.. చాలా కాలానికి శిలాజాలుగా మారి ఉండొచ్చని భావిస్తున్నారు.

కాకతీయుల ఆనవాళ్లు కూడా..

వేమనపల్లి ప్రత్యేకత డైనోసార్లతోనే ఆగిపోలేదు. రాజారం గ్రామంలోని దశావతార విగ్రహాలు సుమారు 12వ శతాబ్దానికి చెందినవిగా భావిస్తున్నారు. ఇవి కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లుగా గుర్తింపు పొందాయి. అంటే.. ఒకవైపు కోట్ల ఏళ్ల క్రితం జీవించిన జీవుల ఆనవాళ్లు.. మరోవైపు శతాబ్దాల క్రితం మనుషులు నిర్మించిన చారిత్రక గుర్తులు ఇక్కడ కనిపిస్తాయి.

ప్రకృతి, చరిత్ర కలిసిన ప్రాంతం

ప్రాణహిత నది, దట్టమైన అడవులు, అరుదైన వృక్షజాతులు, శిలాజాలు, డైనోసార్ అవశేషాలు, కాకతీయుల కాలం నాటి విగ్రహాలు.. ఇలా వేమనపల్లిలో ప్రకృతి, చరిత్ర, భూగర్భ రహస్యాలు ఒకే చోట కనిపిస్తాయి. ఈ ప్రాంతంలోని పురాతన ఆనవాళ్లపై మరింత శాస్త్రీయ పరిశోధన జరిగితే తెలంగాణ గతానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

మేడిపల్లిలో భారీ దోపిడీ.. 11 నిమిషాల్లో రూ.2.5 కోట్లు లూటీ!



క్యారెట్‌లేన్ షోరూంలో భారీ చోరీ

ఏడుగురు దుండగులు పక్కా ప్రణాళికతో దోపిడీ

బిహార్‌కు చెందిన ముఠా పనేనని అనుమానం

పాత ఉద్యోగుల ప్రమేయంపై కూడా పోలీసుల విచారణ

హైదరాబాద్‌సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్ శివారు మేడిపల్లిలో భారీ దోపిడీ జరిగింది. టాటా గ్రూప్‌కు చెందిన క్యారెట్‌లేన్ ఆభరణాల షోరూంలోకి చొరబడిన దుండగులు, కేవలం 11 నిమిషాల వ్యవధిలోనే సుమారు రూ.2.5 కోట్ల విలువైన బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న ఈ షోరూంలోకి మాస్కులు ధరించిన ఏడుగురు దొంగలు సోమవారం తెల్లవారుజామున 4:07 గంటలకు చొరబడ్డారు. ముందుగా బయట ఉన్న సీసీ కెమెరా, అలారం వైర్లను కత్తిరించి, ఇనుప రాడ్లతో షట్టర్ తాళాలు పగలగొట్టారు. అనంతరం ఒక వ్యక్తి అద్దం పగలగొట్టి లోపలికి ప్రవేశించగా, మిగిలిన ఆరుగురు బయట కాపలా కాశారు. లోపలికి వెళ్లిన వ్యక్తి కేవలం ఐదు నిమిషాల్లోనే 580 బంగారు ఆభరణాలను రెండు బ్యాగుల్లో సర్దుకుని బయటకు వచ్చాడు. ఉదయం 4:18 గంటలకు నిందితులందరూ అక్కడి నుంచి పరారయ్యారు. ఉదయం 7 గంటల సమయంలో వాచ్‌మ్యాన్ షట్టర్ తెరిచి ఉండటాన్ని గమనించి, షోరూం ఫ్రాంచైజీ యజమాని సుబ్రహ్మణ్యంకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి, నిందితుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. దోపిడీ జరిగిన తీరును బట్టి ఇది పక్కా ప్రణాళికతో జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితులు యువకులే అయి ఉండొచ్చని, ఇది బిహార్‌కు చెందిన ముఠా పనే కావచ్చని అనుమానిస్తున్నారు. ఇటీవల దుకాణంలో ముగ్గురు ఉద్యోగులు మానేసిన నేపథ్యంలో, వారి ప్రమేయంపైనా పోలీసులు విచారణ జరుపుతున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.

4 లక్షలు తీసుకుంటూ ఒకరు.. లక్ష తీసుకుంటూ మరొకరు.. ఏసీబీ చేతికి చిక్కిన ఇద్దరు మహిళా అధికారులు

రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి అరెస్ట్

రూ. లక్ష లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత అరెస్ట్

నిర్మాణ అనుమతుల కోసం రూ.4 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత

హైదరాబాద్‌సామాన్యుడి అస్త్రం

అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ ఏసీబీ అధికారులు సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో ఇద్దరు మహిళా ప్రభుత్వ అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి, జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ తులసీరామ్ సునీత లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న స్వర్ణకుమారి ఎల్‌బీనగర్‌లో అనుమతి లేకుండా నడుస్తున్న ఓ ఫిజియోథెరపీ కేంద్రంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు, కొత్త లైసెన్స్ ఇచ్చేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ద్వారా రూ. లక్షను స్వీకరించి, తన ప్రైవేట్ డ్రైవర్ మద్దూరి కృష్ణయ్యకు అప్పగించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు,



డబ్బుతో వెళ్తున్న కృష్ణయ్యను పట్టుకున్నారు. అనంతరం స్వర్ణకుమారి నివాసం, కార్యాలయంలో సోదాలు జరిపి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో స్వర్ణకుమారితో పాటు శ్రీనివాస్, కృష్ణయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు.. కారణమిదే!



గాంధీ జయంతి నాడు మాంసం దుకాణాల మూసివేతపై వివాదం

ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించారని పిటిషనర్ ఆరోపణ

కమిషనర్‌పై చర్యలు తీసుకుని, రూ.50,000 జరిమానా విధించాలని అభ్యర్థన

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

గాంధీ జయంతి సందర్భంగా నగరంలో మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించారంటూ దాఖలైన పిటిషన్‌పై నిన్న విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.తార్నాకకు చెందిన న్యాయ విద్యార్థి వడ్ల శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో ఇలాంటి ఉత్తర్వులపై శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. స్లాటర్‌హౌస్‌లు, మాంసం దుకాణాల మూసివేతకు సంబంధించిన ఏ ఉత్తర్వులైనా జీహెచ్‌ఎంసీ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని స్పష్టం చేసిందని పిటిషనర్ తరపు న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరించారు.అయితే, ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్లాటర్‌హౌస్‌లు, రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని సెప్టెంబర్ 30న జీహెచ్‌ఎంసీ పత్రికా ప్రకటన విడుదల చేసిందని ఆయన వాదించారు. జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం రూపొందించిన నిబంధనలను గెజిట్‌లో ప్రచురించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మాంసం దుకాణాల మూసివేత వ్యాపారుల ప్రాథమిక హక్కులను (ఆర్టికల్ 19(1)(స్త్ర)) ఉల్లంఘిస్తుందని తెలిపారు.కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయనకు రూ.50,000 జరిమానా విధించాలని పిటిషన్‌లో కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం, కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 2వ తేదీకి వాయిదా వేసింది.

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్.. జైలు నుంచి విడుదల

లైంగిక వేధింపుల కేసులో ట్రైనీ ఐపీఎస్‌కు బెయిల్

67 రోజుల తర్వాత జైలు నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి విడుదల

షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన ఉప్పరపల్లి కోర్టు


సహచర మహిళా అధికారి ఫిర్యాదుతో గతంలో అరెస్ట్

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి ఊరట లభించింది. సుమారు 67 రోజులుగా జైల్లో ఉన్న ఆయనకు హైదరాబాద్‌లోని ఉప్పరపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు.గతంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన సహచర మహిళా ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేశారు.అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా ఈ కేసులో విచారణ జరిపిన ఉప్పరపల్లి కోర్టు, ఆయనకు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి బయటకు వచ్చారు.



కాఫీ తాగితే శరీరంలో ఐరన్ లోపిస్తుందా?



ఉదయం లేవగానే ఓ కప్పు కాఫీ.. చాలామందికి ఇది రోజును మొదలుపెట్టే చిన్న అలవాటు. అయితే అదే కాఫీని అల్పాహారంతో పాటు తీసుకుంటే మాత్రం శరీరానికి అందాల్సిన ఐరన్ తగ్గే అవకాశం ఉందని ఆస్టర్ వైట్‌ఫీల్డ్ ఆసుపత్రిలో చీఫ్ డైటీషియన్ వీణా ఎన్‌డీటీవీతో తెలిపారు. ముఖ్యంగా మొక్కల ఆధారిత ఆహారం నుంచి ఐరన్ పొందేవారు ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

ఐరన్ శోషణపై ప్రభావం

కాఫీలో పాలీఫినాల్స్ ఉంటాయి. ముఖ్యంగా క్లోరోజెనిక్ యాసిడ్స్ వంటి సమ్మేళనాలు మొక్కల ఆహారంలో ఉండే నాన్-హీమ్ ఐరన్ శోషణను తగ్గించగలవు. దీంతో పప్పులు, బీన్స్, కూరగాయలు, నట్స్, ఐరన్ కలిపిన ఆహారం నుంచి శరీరానికి అందే ఐరన్ పరిమాణం తగ్గొచ్చు.

భోజనం తర్వాత కాఫీతోనూ సమస్య

ఐరన్ ఎక్కువగా ఉండే భోజనం తిన్న వెంటనే కాఫీ తాగినా ఈ ప్రభావం కనిపించొచ్చు. ఐరన్ సప్లిమెంట్లు తీసుకునేవారు కూడా కాఫీతో కలిపి మాత్రలు వేసుకోకపోవడం మంచిది. అయితే కాఫీ తాగిన ప్రతిసారీ ఐరన్ లోపం వస్తుందని భావించాల్సిన అవసరం లేదు.

ఎవరు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి?

ఇప్పటికే ఐరన్ లోపం ఉన్నవారు, ఐరన్ అవసరం ఎక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలి. ఆహారంలో ఎక్కువ భాగం మొక్కల ఆధారిత ఐరన్‌పై ఆధారపడేవారూ కాఫీ సమయాన్ని గమనించాలి.

'విటమిన్-సి'తో మేలు

ఐరన్ ఉన్న ఆహారంతో విటమిన్-సి తీసుకోవడం శోషణకు సహాయపడుతుంది. ఉసిరి, జామ, టమాటా, క్యాప్సికమ్, సిట్రస్ పండ్లను భోజనంలో చేర్చుకోవచ్చు. మరోవైపు టీ, కాఫీలోని కొన్ని సమ్మేళనాలు, కాల్షియం ఐరన్ శోషణకు అడ్డంకిగా మారొచ్చు.

లోపం ఉంటే కారణం తెలుసుకోవాలి

ఐరన్ లోపం లేదా రక్తహీనత నిర్ధారణ అయితే కాఫీ సమయం మార్చడం ఒక్కటే పరిష్కారం కాదు. ఆహార లోపం, శరీరంలో ఐరన్ శోషణ తగ్గడం, రక్తస్రావం వంటి కారణాలను గుర్తించాలి. మహిళల్లో అధిక నెలసరి రక్తస్రావం కూడా కారణం కావచ్చు. అవసరమైతే వైద్యుల సలహాతో చికిత్స తీసుకోవాలి.

కాఫీ మానేయాల్సిన పనిలేదు

ఆరోగ్యంగా ఉన్నవారు కాఫీని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. ఐరన్ సప్లిమెంట్‌తో కలిపి తాగకుండా ఉండటం, ఐరన్ అధికంగా ఉన్న భోజనం తర్వాత వెంటనే కాఫీ తీసుకోకుండా ఉండటం ఉపయోగకరం. ఐరన్ లోపం ఉన్నవారు ఈ విషయంలో మరింత జాగ్రత్త వహించాలి.

వ్యాయామం చేయకుండానే చెమట పడుతోందా?

చెమట పట్టడం సహజమే. ఎండలో ఉన్నప్పుడు, వ్యాయామం చేసినప్పుడు లేదా ఒత్తిడికి గురైనప్పుడు చెమట రావడం సాధారణం. కానీ ఎలాంటి కారణం లేకుండానే ఒక్కసారిగా విపరీతంగా చెమట పడితే మాత్రం కాస్త జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా ఛాతీలో అసౌకర్యం, ఆయాసం, వికారం, తల తిరగడం లేదా అకస్మాత్తుగా నీరసం వంటి లక్షణాలు కూడా ఉంటే దాన్ని తేలిగ్గా తీసుకోకూడదు.

గుండె సమస్యతో చెమట ఎందుకు పడుతుంది?

గుండెపై తీవ్ర ఒత్తిడి పడినప్పుడు శరీరం అత్యవసర పరిస్థితిలో ఉన్నట్లు స్పందిస్తుంది. గుండెపోటు సమయంలో సింపథెటిక్ నాడీ వ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. దీంతో గుండె వేగం పెరగడం, రక్తపోటులో మార్పులు రావడం, చెమట గ్రంథులు ఎక్కువగా పనిచేయడం జరుగుతుంది.అప్పుడు ఒక్కసారిగా చల్లటి చెమటలు పట్టొచ్చు. చర్మం వేడిగా కాకుండా తడిగా, జిగటగా అనిపించొచ్చు. ఊరికే కూర్చున్నా ఈ పరిస్థితి రావచ్చు.

ఇతర లక్షణాలు ఉంటే మరింత జాగ్రత్త

చెమట ఒక్కటే వస్తే గుండె సమస్య అని చెప్పలేం. జ్వరం, ఆందోళన, రక్తంలో చక్కెర తగ్గడం, హార్మోన్ల మార్పులు, ఇన్ఫెక్షన్లు, కొన్ని మందుల వల్ల కూడా చెమట పట్టొచ్చు.అయితే చెమటతో పాటు ఛాతీలో బిగుతు లేదా భారంగా అనిపించడం, చేయి, భుజం, వీపు, మెడ లేదా దవడ భాగంలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు, తల తిరగడం, తీవ్రమైన నీరసం, గుండె వేగం మారడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

రోజువారీ పనుల్లోనూ చెమట ఎక్కువగా వస్తోందా?

ఇంతకుముందు సులభంగా చేసిన పనికే ఇప్పుడు విపరీతంగా చెమట పడుతోందా? మెట్లు ఎక్కడం, నడవడం లేదా ఇంటి పనులు చేస్తున్నప్పుడు చెమటతో పాటు ఆయాసం, ఛాతీలో అసౌకర్యం వస్తోందా? అయితే వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఉదాహరణకు గతంలో 30 నిమిషాలు సులభంగా నడిచిన వ్యక్తికి ఇప్పుడు 10 నిమిషాలకే చెమట, ఆయాసం, నీరసం వస్తే.. ఆ మార్పును గమనించాలి.

రాత్రిపూట చెమట పడితే?

రాత్రి చెమట పట్టడానికి చాలా కారణాలు ఉండొచ్చు. గది వేడిగా ఉండటం, ఇన్ఫెక్షన్లు, హార్మోన్ల మార్పులు, కొన్ని మందులు ఇందుకు కారణం కావచ్చు.

టమాటాతో సాధ్యమేనంటున్న కొత్త పరిశోధన

మధ్య వయస్కుల్లో మెదడు పనితీరుపై టమాటాల ప్రభావంపై అధ్యయనం
రోజూ టమాటా పేస్ట్ తీసుకున్న వారిలో మెరుగైన ఏకాగ్రత, గ్రహణ శక్తి
జ్ఞాపకశక్తికి, మెదడు కణాల ఆరోగ్యానికి టమాటాలు మేలు చేసే అవకాశం
ఇది ప్రాథమిక అధ్యయనం మాత్రమేనని, మరిన్ని పరిశోధనలు అవసరమని వెల్లడి



ఆహారంలో టమాటాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మధ్య వయస్కులలో మెదడు పనితీరు మెరుగుపడుతుందని ఒక చిన్న క్లినికల్ ట్రయల్‌లో తేలింది. ముఖ్యంగా ఏకాగ్రత, సమాచారాన్ని వేగంగా గ్రహించే సామర్థ్యం, జ్ఞాపకశక్తి వంటి అంశాలపై టమాటాలు సానుకూల ప్రభావం చూపినట్లు పరిశోధకులు గుర్తించారు.


అధ్యయనం జరిగిందిలా..

ఈ పరిశోధన కోసం 40 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసున్న 47 మంది ఆరోగ్యవంతులను ఎంపిక చేశారు. వీరికి 90 రోజుల పాటు వారి శరీర బరువుకు అనుగుణంగా గాఢత కలిగిన టమాటా పేస్ట్‌ను ఆహారంలో భాగంగా ఇచ్చారు. ఆ తర్వాత నెల రోజుల విరామం ఇచ్చి, మళ్లీ 90 రోజుల పాటు లైకోపీన్ చాలా తక్కువగా ఉండే ఆహారాన్ని అందించారు. ఈ అధ్యయనాన్ని 42 మంది విజయవంతంగా పూర్తి చేశారు.టమాటా పేస్ట్ తీసుకున్న కాలంలో వారిలో వచ్చిన మార్పులను పరిశీలించగా పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. వారిలో అనవసర విషయాలను పక్కనపెట్టి, ముఖ్యమైన సమాచారంపై దృష్టి కేంద్రీకరించే సామర్థ్యం (సెలెక్టివ్ అటెన్షన్) పెరిగింది. అలాగే, సమాచారాన్ని వేగంగా విశ్లేషించి, గ్రహించే వేగం కూడా మెరుగుపడింది. ముఖాలను, పేర్లను గుర్తుంచుకోవడం వంటి అనుబంధ జ్ఞాపకశక్తి (అసోసియేటివ్ మెమరీ)లో స్వల్ప వృద్ధి కనిపించింది.

లైకోపీన్ పాత్ర కీలకం

టమాటాలకు ఎర్రటి రంగును ఇచ్చే లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ మెదడు పనితీరు మెరుగుపడటానికి కారణంగా పరిశోధకులు భావిస్తున్నారు. ఈ లైకోపీన్ రక్త-మెదడు అవరోధాన్ని (ఎత్రీశీశీఎ-ఎఖీఅఅ ఎఖతీతీఅవతీ) దాటి మెదడు కణాలకు చేరగలదు. అక్కడ ఆక్సీకరణ ఒత్తిడి, వాపును తగ్గించడం ద్వారా మెదడు ఆరోగ్యానికి తోడ్పడుతుంది.అంతేకాకుండా, టమాటా పేస్ట్ తీసుకున్న వారిలో మెదడు కణాల ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి తోడ్పడే 'బ్రెయిన్-డిరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్' (దీణచీఖీ) అనే ప్రోటీన్ స్థాయిలలో స్వల్ప పెరుగుదలకు సంబంధించిన సంకేతాలు కనిపించాయని, అయితే దీనిపై స్పష్టమైన నిర్ధారణకు రాలేదని పరిశోధకులు తెలిపారు. వారి బ్రెయిన్ స్కాన్‌లను విశ్లేషించగా, మెదడులోని వివిధ ప్రాంతాల మధ్య సమాచార మార్పిడి విధానంలో మార్పులు జరిగినట్లు సూచనలు కనిపించాయి.అయితే, ఇది చాలా చిన్న స్థాయిలో జరిగిన అధ్యయనం మాత్రమేనని, దీని ఆధారంగా టమాటాలు జ్ఞాపకశక్తి క్షీణతను లేదా మతిమరుపును పూర్తిగా నివారిస్తాయని చెప్పలేమని పరిశోధకులు స్పష్టం చేశారు. ఈ ఫలితాలను నిర్ధారించుకోవడానికి మరింత ఎక్కువ మందిపై పెద్ద ఎత్తున పరిశోధనలు జరగాల్సి ఉందని వారు అభిప్రాయపడ్డారు.

ఫుడ్ అలర్జీ: సాధారణ ఆహారమే కొందరికి ప్రమాదకరం.. ఎందుకని?



ఆహారంలోని ప్రోటీన్లపై రోగనిరోధక వ్యవస్థ పొరపాటున దాడి చేయడమే ఫుడ్ అలర్జీ
వేరుశెనగ, పాలు, గుడ్లు, రొయ్యలు వంటివి ప్రధాన అలర్జీ కారకాలు
దద్దుర్లు, వాపు, వాంతులు, శ్వాస ఇబ్బందులు వంటివి సాధారణ లక్షణాలు
లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం

మనం రోజూ తినే పాలు, గుడ్లు, వేరుశెనగ వంటి ఎన్నో ఆహారాలు సంపూర్ణ పోషకాలను అందించి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కానీ కొందరి విషయంలో మాత్రం అవే ప్రమాదకరంగా మారతాయి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్న తర్వాత కొందరిలో దద్దుర్లు, దురద, వాపు, వాంతులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు కనిపిస్తుంటాయి. దీనినే 'ఫుడ్ అలర్జీ' అంటారు. ఇది సాధారణ సమస్యగా అనిపించినా, కొన్నిసార్లు ప్రాణాపాయ స్థితికి దారితీయగలదు. అందుకే దీనిపై పూర్తి అవగాహన అవసరం.

అసలు అలర్జీ ఎందుకు వస్తుంది?

సాధారణంగా మన రోగనిరోధక వ్యవస్థ) శరీరంలోకి ప్రవేశించే హానికర బ్యాక్టీరియా, వైరస్‌లపై పోరాడుతుంది. అయితే, ఫుడ్ అలర్జీ ఉన్నవారిలో మాత్రం రోగనిరోధక వ్యవస్థ పొరపాటు చేస్తుంది. పాలు, గుడ్లు, వేరుశెనగ వంటి ఆహార పదార్థాల్లో ఉండే కొన్ని ప్రోటీన్లను హానికరమైనవిగా గుర్తిస్తుంది. వాటిపై దాడి చేసేందుకు ఇమ్యునోగ్లోబ్యులిన్ జు (xస్త్రజు) అనే యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తుంది. ఈ యాంటీబాడీలు మాస్ట్ కణాలను ప్రేరేపించి హిస్టమిన్ వంటి రసాయనాలను విడుదల చేస్తాయి. ఈ హిస్టమిన్ వల్లే చర్మంపై దద్దుర్లు, వాపు, దురద, శ్వాసనాళాలు సంకోచించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

సాధారణంగా అలర్జీ కలిగించే ఆహారాలు

కొన్ని రకాల ఆహార పదార్థాలు ఫుడ్ అలర్జీలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవి:

వేరుశెనగలు, ఇతర గింజలు: వేరుశెనగ, జీడిపప్పు, బాదం, వాల్‌నట్‌లలోని ప్రోటీన్లు తీవ్రమైన అలర్జీలకు కారణమవుతాయి. కొన్నిసార్లు ఇది 'అనాఫైలాక్సిస్' అనే ప్రాణాపాయ స్థితికి దారితీయవచ్చు.

పాలు: ఆవు పాలలో ఉండే కేసిన్ (జ్ఞుంవఅఅ), వే (ఔష్ఠవఎ) ప్రోటీన్ల వల్ల పిల్లల్లో, పెద్దల్లో అలర్జీ రావచ్చు.
గుడ్లు: గుడ్డులోని ఓవల్బుమిన్) వంటి ప్రోటీన్లు అలర్జీని ప్రేరేపిస్తాయి.
చేపలు, రొయ్యలు (షెల్‌ఫిష్): వీటిలోని పార్వల్బుమిన్, ట్రోపోమైయోసిన్ వంటి ప్రోటీన్లు కొందరికి పడవు.
గోధుమలు: గోధుమ అలర్జీ అనేది గ్లూటెన్ పడకపోవడం లేదా సీలియాక్ వ్యాధికి భిన్నమైనది. ఇది గోధుమలోని కొన్ని ప్రత్యేక ప్రోటీన్ల వల్ల వస్తుంది.
సోయా, నువ్వులు: ఈ పదార్థాల్లోని ప్రోటీన్లు కూడా కొందరిలో దద్దుర్లు, వాపు, కడుపులో అసౌకర్యం వంటి లక్షణాలకు కారణమవుతాయి.

లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దు

ఫుడ్ అలర్జీ లక్షణాలు వ్యక్తిని బట్టి, తీసుకున్న ఆహారాన్ని బట్టి మారుతుంటాయి. తేలికపాటి దద్దుర్లు, దురద నుంచి పెదాలు, గొంతు వాచిపోయి శ్వాస అందకపోవడం వరకు తీవ్రత ఉంటుంది. లక్షణాలు కనిపించినప్పుడు సొంత వైద్యం చేసుకోవడం ప్రమాదకరం. వెంటనే వైద్యులను సంప్రదించి రక్త పరీక్షలు లేదా స్కిన్ టెస్టుల ద్వారా ఏ ఆహారం పడటం లేదో నిర్ధారించుకోవాలి. వైద్యుల సూచన మేరకు అలర్జీ కారక ఆహారాలకు దూరంగా ఉండటం, అవసరమైతే మందులు వాడటం ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చు. ఆహారం విషయంలో అవగాహన, అప్రమత్తత చాలా అవసరం.

థైరాయిడ్ ఉన్నవారు మఖానా తినొచ్చా?

ఆధునిక జీవనశైలిలో చాలామందిని వేధిస్తున్న సమస్యల్లో థైరాయిడ్ ఒకటి. ఈ సమస్య ఉన్నవారు ఆహారం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏవి తినాలి, ఏవి తినకూడదు అనే సందేహాలు తరచుగా వస్తుంటాయి. ఈ నేపథ్యంలో తేలికపాటి స్నాక్‌గా ప్రాచుర్యం పొందిన 'మఖానా' థైరాయిడ్ రోగులకు సురక్షితమేనా? అనే ప్రశ్నకు నిపుణులు సమాధానమిస్తున్నారు. మఖానా తినడం వల్ల థైరాయిడ్ ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావం ఉంటుందో వివరించారు.

మఖానా ఎందుకు సురక్షితం?

థైరాయిడ్ సమస్యలున్న వారికి మఖానా ఒక సురక్షితమైన, ఆరోగ్యకరమైన స్నాక్ అని తెలిపారు. దీనికి ప్రధాన కారణం మఖానాలో 'గాయిట్రోజెన్‌లు' లేకపోవడమే. సాధారణంగా క్యాబేజీ, క్యాలీఫ్లవర్, సోయా, కొన్ని రకాల మిల్లెట్ల వంటి వాటిలో ఈ గాయిట్రోజెన్‌లు ఉంటాయి. ఇవి శరీరంలో అయోడిన్ వినియోగాన్ని అడ్డుకుని, థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తాయి. అయితే, యూరియేల్ ఫెరాక్స్ అనే మొక్క నుంచి లభించే మఖానాలో ఈ సమ్మేళనాలు ఉండవు. అందువల్ల హైపోథైరాయిడిజం లేదా హైపర్‌థైరాయిడిజం ఉన్నవారు ఎటువంటి ప్రత్యేక తయారీ లేకుండానే మఖానాను సురక్షితంగా తినవచ్చని స్పష్టం చేశారు.

బరువు నియంత్రణ, పోషకాల లభ్యత

థైరాయిడ్ సమస్యతో బాధపడేవారిలో బరువు పెరగడం లేదా తగ్గడం ఒక సాధారణ లక్షణం. మఖానా బరువు నియంత్రణలో సమర్థంగా సహాయపడుతుంది. 30 గ్రాముల మఖానాలో దాదాపు 110 కేలరీలు మాత్రమే ఉంటాయి. ఇందులో ఉండే అధిక ఫైబర్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు త్వరగా కడుపు నిండిన అనుభూతిని అందించి, అతిగా తినడాన్ని నియంత్రిస్తాయి.ఇంతేకాకుండా థైరాయిడ్ హార్మోన్ల సరైన పనితీరుకు అవసరమైన కీలక ఖనిజాలు మఖానాలో పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా థైరాయిడ్ గ్రంథి ఉత్పత్తి చేసే ం4 హార్మోన్‌ను క్రియాశీల ం3 హార్మోన్‌గా మార్చడంలో మెగ్నీషియం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ మెగ్నీషియంతో పాటు కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం వంటివి కూడా మఖానా ద్వారా శరీరానికి అందుతాయి.

ప్యారిస్‌లో చీరకట్టుతో జాన్వీ..

బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అందరినీ అబ్బురపరిచారు. ప్యారిస్‌లో జరిగిన ఓ గాలా ఈవెంట్‌లో ఆమె ధరించిన ప్రత్యేకమైన చీరకట్టు ఇప్పుడు అంతర్జాతీయ ఫ్యాషన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారతీయ హస్తకళకు ఆధునిక సొబగులు అద్దిన ఈ లుక్‌తో జాన్వీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమానికి జాన్వీ న్యూఢిల్లీకి చెందిన 'పంకజ్ ఎస్. హెరిటేజ్' లేబుల్ డిజైన్ చేసిన చీరను ఎంచుకున్నారు. సహజమైన ఐవరీ రంగులో ఉన్న ఈ చీరను చారిత్రక ప్రాధాన్యమున్న 460-కౌంట్ బెంగాల్ మస్లిన్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేశారు. మొఘలుల కాలంలో ఢాకా ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ఈ వస్త్రాన్ని 'బాస్ట్ హవా' (నేసిన గాలి) అని పిలిచేవారు. అంతటి సున్నితమైన చీరపై తెల్లటి చికంకారీ ఎంబ్రాయిడరీ అదనపు అందాన్ని తెచ్చిపెట్టిందిఅయితే, ఈ చీరకట్టులో అసలైన హైలైట్ ఆమె ధరించిన బ్లౌజ్. ఈ బ్లౌజ్ స్లీవ్స్‌ను పోల్కీలు, గార్నెట్‌లు, పచ్చలతో దట్టంగా పాదిగారు. ఈ స్లీవ్స్ భుజాలపై నుంచి జాలువారుతున్న ఆభరణాల్లా కనిపించడంతో జాన్వీ మెడలో ఎలాంటి నెక్లెస్ ధరించకుండానే సంపూర్ణమైన లుక్‌ను సాధించారు. దీనికి తగ్గట్టుగా కోల్‌కతాకు చెందిన 'విక్రాయా జ్యూయలరీ' చెవిపోగులు, కఫ్‌లతో పాటు స్లీవ్స్‌కు మ్యాచింగ్ అయ్యేలా పచ్చలు పాదిగిన ఉంగరాన్ని ధరించారు.మేకప్ ఆర్టిస్ట్ నోరా కౌర్కిస్ అందించిన సాఫ్ట్ గ్లామ్ మేకప్, స్లీక్ బన్ హెయిర్‌స్టైల్ ఈ లుక్‌ను మరింత ఉన్నతంగా నిలబెట్టాయి. మొత్తం మీద, జాన్వీ కపూర్ లుక్ భారతీయ వారసత్వ హస్తకళకు, ఆధునిక ఫ్యాషన్‌కు మధ్య అద్భుతమైన వారధిలా నిలిచిందని ఫ్యాషన్ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు.



ఏకంగా 15 నిమిషాలు ఊపిరి బిగబట్టిన బాలీవుడ్ నటుడు



ప్రముఖ బాలీవుడ్ నటుడు, మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు విద్యుత్ జమ్వాల్ ఓ అరుదైన, ప్రమాదకరమైన విన్యాసాన్ని ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ముంబైలో జరిగిన 'స్ట్రీట్ ఫైటర్' అనే తన హాలీవుడ్ చిత్రం ప్రమోషనల్ ఈవెంట్‌లో ఆయన సుమారు 15 నిమిషాల పాటు శ్వాసను బంధించి ధ్యాన ముద్రలో నిశ్చలంగా ఉన్నారు. తాను ఈ చిత్రంలో యోగా గురువు 'ధల్సిమ్' పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఆ పాత్రకు సంబంధించిన నైపుణ్యాన్ని చూపించేందుకే ఈ ప్రదర్శన ఇచ్చారు.ఈ సందర్భంగా విద్యుత్ జమ్వాల్ మాట్లాడుతూ.. ఇది పతంజలి యోగ సూత్రాల నుంచి తాను నేర్చుకున్న ఒక పురాతన టెక్నిక్ అని తెలిపారు. శ్వాసను బిగబట్టినంత సేపు కళ్లు తెరిచే ఉంచగా, సమయం గడిచేకొద్దీ ఆయన కళ్ల నుంచి నీళ్లు రావడం కనిపించింది. జీవితంలో లక్ష్యాల కోసం నిరంతరం పరుగులు పెట్టకుండా, కాసేపు ఆగి నిదానించడం కూడా ముఖ్యమని ఆయన అన్నారు. ఈ యోగ పద్ధతిని తాను యువతకు కూడా నేర్పిస్తున్నట్లు విద్యుత్ పేర్కొన్నారు.

పుస్తక రూపంలో రమాప్రభ జీవిత కథ.

సీనియర్ నటి రమాప్రభ జీవిత ప్రయాణం పుస్తక రూపంలోకి వచ్చింది. 'రమాప్రభ.. ఇదేనండి నా కథ' పేరుతో వెలువడిన ఈ పుస్తకాన్ని ఆమె 81వ పుట్టినరోజు సందర్భంగా ఆవిష్కరించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలోని బసినకొండ పంచాయతీ, గంగన్నగారిపల్లెలో ఉన్న ఆమె నివాసంలో స్థానిక ప్రముఖులు, అభిమానులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఎవరికోసమో మారలేను!



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న) జంటగా నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా('రణబాలి రాహుల్ సాంకృ త్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ చిత్రం అక్టోబర్ 16న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్లను ము మ్మరం చేసింది. తాజాగా ఇంటర్వ్యూల్లో పాల్గొన్న రష్మిక.. తనపై వచ్చే సోషల్ మీడియాలోవచ్చే ట్రోలింగ్స్‌పై(ధీటుగా స్పందించారు. "నేను నాలా ఉండటానికి ఎలాంటి నాటకాలు ఆడాల్సిన అవసరం లేదు. నా ప్రవర్తన చాలా నేచురల్‌గా ఉంటుంది.అందరికీ నా పద్ధతి నచ్చకపోవచ్చు, ఎందుకంటే ప్రతి ఒక్కరి అభిరుచులు ఒకేలా ఉండవు.

క్రేజీ కల్యాణం.. రెండు వారాల ముందే!



నరేశ్ వీకేఅనుపమ పరమేశ్వరన్(ూ, తరుణ్ భాస్కర్, 'రాజు వెడ్స్ రాంబాయి(ఫేమ్ అఖిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'క్రేజీ కల్యాణం(. భద్రప్ప గాజుల దర్శకత్వంలో బూసం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మిస్తు న్నారు. ఈ సినిమా ఈ నెలాఖరున అంటే అక్టోబర్ 30న విడుదల కావాల్సిన ఈ సినిమా రెండు వారాల ముందే ఈ నెల 16వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ మంగళవారం అధికారికంగా ప్రకటించారు.ఇప్పటికే ప్రమోష నల్ కంటెంట్‌తో మూవీ లవర్స్‌ను బాగా ఆకర్షించిందీ చిత్రం. ముఖ్యంగా సాంగ్స్ చాట్‌బస్టర్స్ అయ్యాయి. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌లోనూ మంచి అంచనాలున్నాయి. ఈ చిత్రానికి డీవోపీ: శ్యామ్ దూపాటి; సంగీతం: సురేశ్ బొబ్బిలి; లిరిక్స్: గోరటి వెంకన్న, చైతన్యప్రసాద్, కాసర్ల శ్యామ్; యాక్షన్: డ్రాగన్ ప్రకాశ్; ఎడిటర్: శ్రావణ్ కటికనేని; ఆర్ట్: సాయి కదిర.

శ్రీవిష్ణు మార్క్ కామెడీ పక్కా..

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్ మెంట్' శ్రీవిష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇందులో మహిమా నంబియార్(హీరోయిన్. అక్టోబర్ 9న విడుదల కానున్న ఈ సినిమా విశేషాలను కథానాయకి మహిమా నంబియార్(విలేకరులతో పంచుకుంది. "తొలిసారి తెలుగులో నటించడం సరికొత్త అనుభవం. నేను ఏదైనా భాషను త్వరగా నేర్చుకోగలను.తెలుగు నాకు అర్థమవుతుంది. అలాగే ప్రతి లైన్‌కు దర్శకుడిని అడిగి అర్థం తెలుసుకుంటాను. ఈ సినిమాలో శ్రీవిష్ణు సిగ్నేచర్ స్టైల్లో ఫన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. శ్రీవిష్ణు చాలా స్పాంటేనిటీ ఉన్న యాక్టర్. షూటింగ్ స్పాట్‌లో చాలా ఇంప్రొవైజ్ చేస్తుంటారు. అది నాకు మరింత ఛాలెంజింగ్‌గా ఉంటుంది. ఆయన తెలుగును



అర్థం చేసుకోవడం నాకు కష్టం (నవ్వుతూ). ఆయనకు ఒక సిగ్నేచర్ స్టైల్ ఉంది. నిజంగా అంత స్పాంటేనిటీ ఉన్న యాక్టర్‌తో కలిసి నటించడం మంచి ఎక్స్‌పీరియన్స్. ఇంతకుముందు శ్రీవిష్ణుతో నేను 'సామజవరగమన' చేయాల్సింది.ఆ సినిమా కోసం ఫొటోషూట్ కూడా జరిగింది. కొన్ని కారణాల వల్ల అది కుదరలేదు. ఇప్పుడీ సినిమాతో శ్రీవిష్ణుతో కలిసి తెలుగులో డెబ్యూ చేయడం లక్కీగా ఫీలవుతున్నా. ప్రతి భాషలో కొత్తకొత్త పాత్రలు చేయాలనే నా ఉద్దేశం. ఇప్పటివరకు నేను చేసిన సినిమాలన్నీ దేనికవే ప్రత్యేకం. -ఇందులో నాది చాలా ఫన్ క్యారెక్టర్. పాత్ర పేరు సితారదేవి. పక్కింటి అమ్మాయిలాంటి పాత్ర.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.